క్లుప్తంగా

గ్రంథాలయ సెస్సు వసూలు చేయండి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న లైబ్రేరియన్ శ్రీనివాసరాజు

అనుమసముద్రంపేట: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల నుంచి జిల్లా గ్రంథాలయ సంస్థకు చెల్లించాల్సిన సెస్సు బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓకు భాస్కర్‌కు స్థానిక లైబ్రేరియన్ ఓ శ్రీనివాసరాజు బుధవారం వినతిపత్రం అందజేశారు. ప్రతి పంచాయతీ నుంచి గ్రంథాలయానికి సెస్సు బకాయిలు చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రతి కుటుంబానికి వంద రోజుల పని

ఉదయగిరి: మండలంలో ఉపాధి హామీ పథకంలో అర్హులైన ప్రతి కుటుంబానికి వంద రోజుల పనిదినాలు కల్పించేందుకు ఉపాధి సిబ్బంది కృషి చేయాలని ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ అన్నారు. ఆయన బుధవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కూలీలకు మేట్‌లు, ఎఫ్‌ఏలు కొలతల ప్రకారం పనులు కేటాయించి ప్రభుత్వం నిర్దేశించిన గిట్టుబాటు కూలి నగదు రూ.272 పొందేలా చూడాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని కూలీలు ఉదయం ఆరు గంటలకే పనులకు వెళ్లి 11గంటలకు తిరిగి ఇళ్లకు రావాలన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న ఉషారాణి

సీతారామపురం: మండలంలోని సీతారామపురం, బసినేనిపల్లి, సింగారెడ్డిపల్లిలో జరుగుతున్న నాడు-నేడు పనులను ఏపీసీ ఉషారాణి బుధవారం పరిశీలించారు. ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం మంచి పోషక విలువల ఆహారం అందించాలని నిర్వాహకులకు సూచించారు. నాడు-నేడు పనులు నాణ్యతగా నిర్వహించాలన్నారు. ఆమె వెంట ఎంఈఓ మస్తాన్‌వలి, సచివాలయ సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్ బాలినేని ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్షకు సిద్ధం కండి

అల్లూరు: స్థానిక మహాత్మా జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలలో 2023-24 సంవత్సరానికి ఐదో తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఆదివారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు జరిగే ప్రవేశ పరీక్షకు హాల్ టికెట్లను డౌన్లోడ్ చేసుకొని సిద్ధం కావాలని ప్రిన్సిపల్ పీవీ రమణప్రసాద్ తెలిపారు. వివరములకు 9440393837, 8247005549 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నాణ్యతపై రాజీ పడేది లేదు



మాట్లాడుతున్న ఈఈ శ్రావణ్‌కుమార్ రెడ్డి

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మండలంలోని చిలకపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను సర్వ శిక్షా అభియాన్ ఈఈ శ్రావణ్‌కుమార్‌రెడ్డి బుధవారం పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు-నేడు పనులపై వచ్చిన ఫిర్యాదుల మేరకు తాము తనిఖీలు నిర్వహించామన్నారు. 50 బస్తాల సిమెంట్ గడ్డలు కట్టినట్లుగా గుర్తించామన్నారు. ఇటుకలు, సిమెంట్ నాణ్యత నిర్ధారణ కోసం ల్యాబ్‌కు పంపుతున్నామన్నారు. బొగ్గేరు ఇసుకను నాడు-నేడు నిర్మాణ పనుల్లో వాడొద్దని ఇంజినీరింగ్ అధికారులకు, ప్రధానోపాధ్యాయురాలికి సూచించామన్నారు. ఇతర వివరాలను నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

లారీ ఢీకొని మహిళకు గాయాలు

ఆత్మకూరు: లారీ ఢీకొని ఓ మహిళ తీవ్రంగా గాయపడిన ఘటన నెల్లూరుపాళెం సమీపంలో బుధవారం తెల్లవారుజామున జరిగింది. ఎస్సై ఎం.శివశంకర్‌రావు సమాచారం మేరకు.. అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలానికి చెందిన నాగమ్మ (50) కొద్ది రోజులుగా మతిస్థిమితం లేక ఆత్మకూరు ప్రాంతంలో తిరుగుతోంది. ఈ క్రమంలో నెల్లూరు నుంచి కడప వైపు వెళ్తున్న లారీ నాగమ్మను ఢీకొనడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రెండు సిమెంట్ ట్యాంకర్ల ఢీ

సంగం: సంగం సమీపంలోని కొండ వద్ద నెల్లూరు- ముంబయి జాతీయ రహదారిపై బుధవారం రోడ్డు రెండు సిమెంట్ ట్యాంకర్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. నెల్లూరు వైపు వెళ్తున్న సిమెంట్ ట్యాంకర్‌ను, ఆత్మకూరు వైపు వెళ్తున్న మరో సిమెంట్ ట్యాంకర్ ఎదురెదురుగా ఢీకొనడంతో సిమెంట్ ట్యాంకర్ ముందు భాగం పాక్షికంగా దెబ్బతిన్నాయి. డ్రైవర్లు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

జగనన్నే మా భవిష్యత్

సీతారామపురం: 'మా జగనన్నే మా భవిష్యత్' అంటూ మహిళలు ఉత్సాహంగా చెబుతున్నారు. తమ ఇంటి గోడలకు, ఫోన్లకు అడిగి మరీ స్టిక్కర్లు వేసుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించడానికి వెళ్లిన నాయకులు, కార్యకర్తలకు ప్రజలే స్వచ్ఛందంగా ఎదురేగి స్వాగతం పలుకుతున్నారు. మండలంలోని చిన్ననాగంపల్లిలో బుధవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు మెట్టుకూరు ధనుంజయ రెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటేనే రాష్ట్రంలోని అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని, వలంటీర్లు, గృహసారథులు, నాయకులు సమన్వయం చేసుకొని ప్రజలకు ప్రభుత్వ పథకాల గురించి వివరించాలన్నారు. ప్రతి ఇంటికీ తిరిగి స్టిక్కర్లు అంటించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు చింతంరెడ్డి సుబ్బారెడ్డి, ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి, మాజీ జెడ్పీటీసీ గురవారెడ్డి, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పీసీ అల్లూరురాజు, మండల ఉపాధ్యక్షుడు బసిరెడ్డి, కృష్ణారెడ్డి, మండల సచివాలయాల కన్వీనరు బాలినేని మాబయ్య, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు చప్పిడి తిరుపతిరెడ్డి, ఎంపీటీసీ లక్ష్మీకాంతమ్మ, సర్పంచ్ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

2024లో వైఎస్సార్‌సీపీదే మళ్లీ అధికారం

వింజమూరు (ఉదయగిరి): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి హామీని నిలబెట్టుకుందని, 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి రాబోతుందని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి చెప్పారు. వింజమూరు మండలం బుక్కాపురంలో బుధవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో చంద్రబాబు ఎన్నికల్లో హామీలిచ్చి నిలబెట్టుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చెరుకూరి రసూల్, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పల్లాల కొండారెడ్డి, తాటిచెట్ల కాలేషా, వనిపెంట వెంకటసుబ్బారెడ్డి, కాటం శ్రీనివాసులురెడ్డి తదితరులున్నారు.



చిన్నాగంపల్లిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్న ధనుంజయరెడ్డి



బుక్కాపురంలో జగనన్నే మా భవిష్యత్తు స్టిక్కర్ అందిస్తున్న మెట్టుకూరు చిరంజీవిరెడ్డి



ఆత్మకూరు: ఒకటో వార్డు నరసాపురంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం



ఆత్మకూరురూరల్: కరటంపాడులో సంక్షేమ పథకాలను తెలియజేస్తున్న వల్లభనేని రాజేంద్ర

విస్తృతంగా జగనన్నే మా భవిష్యత్

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో బుధవారం కౌన్సిలర్లు, పార్టీ నాయకులు నిర్వహిస్తున్న 'జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం' నిర్వహించారు. ఒకటో వార్డు నరసాపురంలో కౌన్సిలర్ ఎం.రాజశేఖర్, పట్టణ పార్టీ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. 6,7 వార్డుల పరిధిలో కౌన్సిలర్లు నోటి విజయజ్యోతి, సయ్యద్ నౌషాద్‌బేగం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో వైస్ చైర్మన్ షేక్ సర్దార్, కౌన్సిలర్లు మహబూబ్‌బాషా, కామాక్షయ్యనాయుడు, పెంచలయ్య యాదవ్, నాయకులు నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, సయ్యద్‌జమీర్, సురేష్‌యాదవ్, టి.వెంకటేశ్వర్లు, చిన్నపరెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.

వాడవాడలా మా నమ్మకం నువ్వే జగన్

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు, మర్రిపాడు మండలాల్లోని పలు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, జేసీఎస్ కన్వీనర్లు, సచివాలయాల కో-ఆర్డినేటర్లు, గృహ సారథులు 'మా నమ్మకం నువ్వే జగన్, జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని బుధవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఆత్మకూరు మండలం కరటంపాడులో జేసీఎస్ మండల కన్వీనర్ వల్లభనేని రాజేంద్ర, నాయకులు నెట్టెం పిచ్చయ్య, శేషయ్య, తిరుమల, ఖాసీం, గృహ సారథులు పాల్గొనగా, మర్రిపాడు మండలం నందవరంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఒంటేరు కృష్ణారెడ్డి, ప్రసాదు, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

నిరుపేదల అభ్యున్నతే జగనన్న ధ్యేయం

ఉదయగిరి: రాష్ట్రంలో నిరుపేదల అభ్యున్నతే ప్రధాన ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, మాజీ మండలాధ్యక్షుడు చేజర్ల సుబ్బారెడ్డి అన్నారు.ఆయన బుధవారం మండలంలోని దాసరపల్లిలో జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సయ్యద్ గౌస్‌మోహిద్దీన్, జెడ్పీటీసీ మోది రామాంజనేయులు, ఎంపీటీసీ సుభాన్, మాజీ మండల ఉపాధ్యక్షుడు బాలిబోయిన శ్రీనివాసులు యాదవ్, జిల్లా యువజన విభాగ కార్యదర్శి చేజర్ల సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పరెడ్డిపాళెంలో..

కలిగిరి: మండలంలోని పెద్దకొండూరు పంచాయతీ అయ్యప్పరెడ్డిపాళెంలో జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం 'జగనన్నే మన భవిష్యత్తు' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి బొల్లినేని వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

మళ్లీ సీఎంగా జగనే రావాలి

వరికుంటపాడు: వరికుంటపాడులో బుధవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నియోజకవర్గ పరిశీలకుడు ధనుంజయరెడ్డితో కలిసి స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు పలువురి ఇళ్లకు వెళ్లినప్పుడు మళ్లీ సీఎం జగనే కావాలన్నారు. ఎన్ని ఇబ్బందుల్లో వున్నా ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న సీఎంగా జగన్‌ను మహిళలు కొనియాడారు. ప్రతి ఒక్కరూ పథకాలు అందుతున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పరిశీలకుడు ధనుంజయరెడ్డి మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి అమలు చేయని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, మండల కన్వీనర్ ఆంద్రా బాలగురవారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు కామేపల్లి వెంకటరత్నం, మండల ఉపాధ్యక్షుడు దేవనబోయిన మధు, స్థానిక గుంటుపల్లి నాగభూషణం, మూలె వీరారెడ్డి, గోగుల వెంగళరెడ్డి, గంగవరపు పుల్లయ్య, పి.విజయభాస్కర్‌రెడ్డి, ఏనుగు వెంకటేశ్వరరెడ్డి, బొమ్ము వెంకటరెడ్డి, ఎల్.నాగిరెడ్డి, మానం మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

అల్లూరు: ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పెద్దపీట వేస్తున్నారని వైఎస్సార్ సీపీ నేత దండా కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని సింగపేటలో జగనన్నే మాభవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పథకాల అమలుపై ప్రజాభిప్రాయాన్ని ప్రజల అనుమతితో ఇంటింటికీ వెళ్లి స్టికర్లు అతికించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పంచముఖశక్తి గణపతికి విశేష పూజలు



విశేష అలంకరణలో శ్రీపంచముఖ శక్తి గణపతి స్వామివారు

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మండలంలోని డీసీపల్లిలోని శ్రీపంచముఖశక్తి గణపతి స్వామి వారికి ప్రీతిపాత్రమైన బుధవారం భక్తులు విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని పలు రకాల పండ్ల మాలలు, పుష్పాలతో అలంకరించారు. పంచామృతాభిషేకాల అనంతరం గరిక మాల తోరణాలు ధరింపజేసి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి పాశర్లపూడి వెంకటేశ్వర్లు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

'తుది శ్వాస వరకు జగనన్నతోనే'

నెల్లూరు(బారకాసు): తుదిశ్వాస వరకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే తన పయనమని మన్నెమాల సుకుమార్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాను ఇతర పార్టీలతో సంప్రదింపులు జరుపుతున్నానని, పార్టీ మారే ఆలోచనలో ఉన్నానని కొన్ని ప్రసార మాధ్యమాల్లో రావడం బాధ కలిగించిందని చెప్పారు. తాను ఎలాంటి వాడిననే విషయం పార్టీ జిల్లా పెద్దలందరికీ తెలుసునన్నారు. తనపై దుష్ప్రచారాలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు. కావలి ఎమ్మెల్యేపై పోటీ చేస్తాననే ప్రచారాన్ని ఖండించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించి... జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

సమస్యల పరిష్కారానికి స్పెషల్ డ్రైవ్

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): ఆత్మకూరు నియోజకవర్గంలో ప్రజల సమస్యల పరిష్కారానికి, ప్రత్యేకంగా రెవెన్యూ సమస్యల పరిష్కారానికి స్పెషల్ డ్రైవ్ ప్రారంభించామని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. మర్రిపాడు మండలం పొంగూరులో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తొలుత పొంగూరులోని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రతి గడపకు వెళ్లి ఆయా కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం అందించిన నగదు ప్రోత్సాహకాలను వివరించారు. గ్రామంలో సిమెంట్ రోడ్ల నిర్మాణ విషయమై ప్రజలు ఆయన దృష్టికి తీసుకురాగా త్వరలోనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా మండలానికి పశువైద్యశాఖ ద్వారా మంజూరైన వైఎస్సార్ సంచార పశువైద్య వాహనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ వ్యవసాయ ఆధారితమైన మర్రిపాడు మండలంలో గతంలో రెవెన్యూ రికార్డులు అస్తవ్యస్తంగా ఉన్నా రైతులు పట్టించుకునే వారు కాదని ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి పెట్టుబడి నిధులు అందించడంతో పాటు వ్యవసాయ రంగానికి ప్రోత్సాహకాలు కూడా అందిస్తున్న నేపథ్యంలో తమ భూముల హక్కులపై రైతులు కూడా చైతన్య వంతం అయ్యారన్నారు. పొంగూరులో చేనేత కార్మికుల ఇళ్లను సందర్శించి మగ్గాలను పరిశీలించి నేతన్న నేస్తం పథకం ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సాహకాలను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల గుండెపోటుతో చిన్న వయసులోనే మరణించిన రాపూరు సునీల్‌రెడ్డి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మర్రిపాడు తహసీల్దారు హేమంత్ కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీఓ మస్తాన్‌ఖాన్, పంచాయతీరాజ్, హౌసింగ్, ట్రాన్స్‌కో, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు జయరామిరెడ్డి, రవి, బాలసుబ్రహ్మణ్యం, రవితేజ, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ సురేష్, వెటర్నరీ ఏడీ గురుజయంతి, వెలుగు సీసీ మహాలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, మాజీ మండల కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు, జేసీఎస్ కన్వీనర్ మండల కన్వీనర్ సిద్ధంరెడ్డి మోహన్‌రెడ్డి, సర్పంచ్‌లు అన్నపురెడ్డి రమణమ్మ, నాగెళ్ల హరితేజ, ఎంపీటీసీ సభ్యులు పార్లపల్లి చిన్నకొండారెడ్డి, నాయకులు ఉర్లగడ్డి శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.



పొంగూరులో చేనేత మగ్గాలను పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న ఆత్మకూరు ఎమ్మెల్యే

కస్తూర్బా బాలికల విద్యాలయం ప్రవేశాలకు ఆహ్వానం

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి మర్రిపాడు కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో 6వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ లక్ష్మీదేవి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 6వ తరగతిలో 40, ఇంటర్మీడియట్‌లో 40 సీట్లు ఖాళీలు ఉన్నాయని, అర్హులైన వారు https://apkgbv.apcfss.in వెబ్‌సైట్‌లో కానీ, 9000850953 సెల్ నంబరులో సంప్రదించాలని ఆమె కోరారు.

నూతన డైరీల ఆవిష్కరణ



ఆత్మకూరు: ఉర్దూ ఉపాధ్యాయుల అసోసియేషన్ (రూటా) ఆధ్వర్యంలో ముద్రించిన నూతన డైరీలను మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్ బుధవారం ఆవిష్కరించారు. అసోసియేషన్‌కు చెందిన పలువురు ఉర్దూ ఉపాధ్యాయులు ఆయనతో నూతన డైరీలను ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉర్దూ భాషకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రియాజ్, జిలానీ పాల్గొన్నారు.

రీ సర్వేపై గ్రామ సభ

చేజర్ల: జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష కింద కాశేయపాళెంలో జరుగుతున్న భూముల రీసర్వేకు సంబంధించి బుధవారం మండలంలోని నాగులవెలటూరు గ్రామ సచివాలయంలో గ్రామ సభ నిర్వహించారు. రీసర్వేలో భూ యజమానులు తమకున్న భూముల విస్తీర్ణం, పేర్లు మార్పులకు సంబంధించి అర్జీలను ఇచ్చారు. మరొకసారి భూ సర్వే నిర్వహించి అర్జీదారుల సమస్యలు పరిష్కరిస్తామని భూ యజమానులకు రెవెన్యూ అధికారులు తెలిపారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ ఎం.గిరీష్, వీఆర్వో కోటేశ్వరరావు, గ్రామ సర్వేయర్ వంశీ, భూ యజమానులు పాల్గొన్నారు.

మోపెడ్‌పై నుంచి పడి మహిళకు గాయాలు

కలిగిరి: మోపెడ్‌పై నుంచి జారి పడి ఓ తీవ్రంగా గాయపడిన ఘటన స్థానిక మాలతీ స్కూల్ సమీపంలో బుధవారం జరిగింది. పోలంపాడుకు చెందిన జ్యోతి తన భర్త మోహన్‌తో కలిసి మోపెడ్‌పై కలిగిరికి వస్తున్నారు. జ్యోతి చీర మోపెడ్ చక్రంలో ఇరుక్కుపోవడంతో అదుపుతప్పి పడిపోయింది. ఈ ప్రమాదంలో జ్యోతి తలకు తీవ్రగాయాలయ్యాయి. కలిగిరిలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

కొనుగోలు కేంద్రంలోనే శనగలు అమ్ముకోండి

కొండాపురం: మండలంలోని గుడవల్లూరు కొనుగోలు కేంద్రంలోనే రైతులు శనగలను అమ్ముకోవాలని కొండాపురం కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి మోహన్‌రెడ్డి బుధవారం తెలిపారు. గుడవల్లూరు కొనుగోలు కేంద్రంలో గుడవల్లూరు, నేకునాంపేట, గానుగపెంట, పార్లపల్లి, వెలిగండ్ల గ్రామాల్లో 128 మెట్రిక్ టన్నుల శనగలను కొనుగోలు చేశామన్నారు. కొనుగోలు కేంద్రం ద్వారా అమ్ముకోదలిచిన రైతులు నాణ్యతా ప్రమాణాలను పాటించి శాంపిల్ చూపించాలని సూచించారు.

సంగమేశ్వరుడికి నందిసేవ



నంది వాహనంపై ఆది దంపతులు

సంగం: సంగంలోని కామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి నంది సేవను వైభవంగా నిర్వహించారు. స్వామి అమ్మవారిని పరిమళ పుష్పలతో అలంకరించి నంది వాహనంపై కొలువుదీర్చారు. ఈ సందర్భంగా భక్తులకు ఆలయ ముఖ ద్వారం నుంచి స్వామి అమ్మవార్ల కల్పించారు. అనంతరం స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం గ్రామ పురవీధుల్లో వైభవంగా సాగింది. భక్తులు నైవేద్యాలు సమర్పించి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. నంది సేవకు ఉభయకర్తలుగా పడమటిపాళెం గ్రామస్తులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రవీంద్రబాబు, పాలకమండలి సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు కంటాబత్తిన రఘునాథ్‌రెడ్డి, రావుల ప్రసాద్‌గౌడ్ పాల్గొన్నారు.

సంగం బ్యారేజీ వద్ద ఘాట్లు ఏర్పాట్లు చేయాలి

సంగం: సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో తెప్పోత్సవం అత్యంత ప్రాధాన్యం కలిగిందని, జిల్లా నలుమూలల నుంచి భక్తులు వస్తారని, ఇందు కోసం ప్రమాదరహితమైన ఘాట్లు ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి, బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కాలం బుజ్జిరెడ్డి కోరారు. బుధవారం సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పెన్నాబ్యారేజీని పరిశీలించారు. ఈ సందర్భంగా బ్యారేజీలో నీటి మట్టాన్ని పరిశీలించారు. నీటి మట్టం ఎక్కువగా ఉండడం వల్ల తెప్పోత్సవం నిలిచిపోయే అవకాశం ఉందన్నారు. ఇరిగేషన్ అధికారులు బ్యారేజీ వద్ద నీటిమట్టం తగ్గించి తెప్పోత్సవం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎక్కువగా నీరు ఉండడం వల్ల ప్రమాదం జరిగే అవకాశముందన్నారు. తెప్పోత్సవం నిలిచిపోతే భక్తులు నిరాశకు గురవుతారని, ఇరిగేషన్, పర్యాటక శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపి భవిష్యత్‌లో శాశ్వత ఘాట్‌లు నిర్మించాలని డిమాండ్ చేశారు. బ్యారేజీను పర్యాటంగాను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని ఆయన కోరారు.

ఫ్యామిలీ డాక్టర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖ ద్వారా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మర్రిపాడు మండల వైద్యాధికారి కల్పన అన్నారు. మండలంలోని నందవరం హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో బుధవారం ఆమె తమ సిబ్బందితో కలిసి రోగులకు వైద్య, రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంలో మంచానికే పరిమితమైన చెంచమ్మ ఇంటి వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల ఇళ్ల వద్దకే ప్రభుత్వం వైద్యం తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. హెల్త్ సూపర్‌వైజర్లు సైదా, ఖాజామొహిద్దీన్, హెల్త్ అసిస్టెంట్ పెంచలరావు, ఆశ వర్కర్లు, నారాయణమ్మ, మాధవి పాల్గొన్నారు.



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ కల్పన

కేజీబీవీ పాఠశాల ఆకస్మిక తనిఖీ

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేట కస్తూర్బాగాంధీ పాఠశాలను సమగ్ర శిక్ష జాయింట్ డైరెక్టర్ వరప్రసాద్‌రావు బుధవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులను, వంట గదులను పరిశీలించారు. అనంతరం కొద్దిసేపు విద్యార్థులను, మెనూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ 10వ తరగతి ఫలితాల్లో విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం అనేక పథకాలను ప్రవేశ పెట్టిందని, విద్యార్థులు చక్కగా చదువుకుని మంచి మార్కులు సాధించాలని తెలిపారు. 10వ తరగతి ఫలితాల్లో మంచి మార్కులు సాధించడం వల్ల ఉన్నత చదువులకు మంచి ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు. విదేశాల్లో విద్యకు సైతం ప్రభుత్వం ఆర్థికంగా వెసులుబాటు కల్పిస్తుందని, ప్రతి విద్యార్థి బాగా చదువుకోవాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు. ఆయన వెంట సమగ్రశిక్ష అభియాన్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ ఉషారాణి, అకడమిక్ మానటరింగ్ అధికారి సుధీర్‌బాబు, సీఎంఓ పెంచలయ్య, ప్రిన్సిపల్ శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న జేడీ వరప్రసాద్‌రావు

యుద్ధప్రాతిపదికన ఉపాధి పనులు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా యుద్ధప్రాతిపదికన పనులు పూర్తిచేసి ప్రభుత్వం లక్ష్యం నెరవేర్చాలని ఆత్మకూరు డివిజన్ ఏపీడీ శంకర్‌నారాయణ అన్నారు. మర్రిపాడు ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టీఏలు, బీఎఫ్‌టీలతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ ఉపాధి పనులు తప్పనిసరిగా చేపట్టాల్సిందేనన్నారు. జాబ్‌కార్డులు ఉన్న ప్రతి కుటుంబానికి పనులు కల్పించాల్సిందేనన్నారు. కూలీలకు సరిపడినంత మేర కొలతలతో మార్కింగ్ ఇచ్చి రోజు కూలి రూ.250 తగ్గకుండా వేతనం అందేలా క్షేత్ర సహాయకులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా రైతులు, రైతు కూలీలకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ మస్తాన్ ఖాన్, ఏపీఓ సునీల్, మండలంలోని వివిధ స్థాయిల ఉపాధి హామీ పథకం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఉపాధి హామీ పథకంపై సమీక్షిస్తున్న ఏపీడీ శంకర్ నారాయణ

పాఠశాలలు ప్రారంభం రోజునే జగనన్న విద్యాకానుక

ఉదయగిరి: రాబోయే విద్యాసంవత్సరంలో పాఠశాలలు పునః ప్రారంభం రోజునే విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్‌లు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర సమగ్ర శిక్షా జాయింట్ డైరెక్టర్ సీహెచ్ వాసుదేవరావు అన్నారు. ఆయన బుధవారం విద్యాసంక్షేమ కార్యక్రమాల పరిశీలనలో భాగంగా ఉదయగిరి, సీతారామపురం మండలాల్లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఉదయగిరి ఎంఈఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఏపీలో విద్యా ఉన్నతికి ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపడుతోందన్నారు. పాఠశాలల్లో కల్పిస్తున్న మౌలిక వసతులు, అదనపు తరగతి గదుల నిర్మాణం, జగనన్న విద్యాకానుకలతో అందిస్తున్న 8 రకాల వస్తువులతో పిల్లల తల్లిదండ్రులపై భారం లేకుండా చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సిహెచ్ ఉషారాణి, అకడమిక్ మానిటరింగ్ అధికారి జి.సుధీర్‌బాబు, సీఎంఓ పెంచలయ్య, ఎంఈఓ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా విద్యాకానుక పంపిణీ

సంగం: విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేసే జగనన్న విద్యాకానుక కిట్లను ప్రణాళికాబద్ధంగా పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్లానింగ్ విభాగం జాయింట్ డైరెక్టర్ సీహెచ్ వాసుదేవరావు, నెల్లూరు సమగ్రశిక్ష అభియాన్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ సీహెచ్ ఉషారాణి అన్నారు. బుధవారం సంగం మండల విద్యావనరుల కేంద్రంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. జగనన్న విద్యాకానుక పంపిణీపై వారికి అవగాహన కల్పించారు. యూనిఫాం, షూ కొలతలు, విద్యార్థుల నుంచి పాఠశాల స్థాయిలో తీసుకున్న డేటాకు, అప్‌లోడ్ చేసిన డేటాకు మధ్య తారతమ్యం లేకుండా చూడాలన్నారు. ఎంఈఓ జానకిరాం, సమగ్ర శిక్ష ఏఎంఓ సుధీర్, సీఎంఓ పెంచలయ్య ఉన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న జేడీ వాసుదేవరా

పూలే పురస్కారానికి సంగం ఉపాధ్యాయుడు

సంగం: మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న సోషల్ ఉపాధ్యాయుడు ఎం.విజయప్రదీప్ రాష్ట్ర జ్యోతిరావుపూలే పురస్కారానికి ఎంపికయ్యారని తిరుపతికి చెందిన స్టేట్ పూలే టీచర్స్ ఫెడరేషన్ నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయప్రదీప్ చేసిన సేవలకు ఈ నెల 16న తిరుపతిలోని దుర్గాభాయ్‌దేశ్‌ముఖ్ ప్రాంగణంలో ఈ అవార్డును అందజేయనున్నారు.

మెరుగైన వైద్యసేవల అందించండి

ఉదయగిరి: వైద్యశాలకు వచ్చే రోగులను వైద్యసిబ్బంది ఆప్యాయంగా పలకరిస్తూ మెరుగైన వైద్య సేవలందించాలని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు, జీఎంకే చారిటబుల్ ట్రస్ట్ అధినేత గుంటుపల్లి మాలకొండయ్య అన్నారు. ఆయన బుధవారం ఎంపీపీ మూలె పద్మజతో కలిసి మరమ్మతులు పూర్తి చేసుకున్న మండలంలోని గండిపాళెం వైద్యశాల భవనాన్ని పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యశాల అభివృద్ధికి ప్రభుత్వ నిధులతో సంబంధం లేకుండా తన జీవితాంతం ఏడాదికి రూ.1.50 లక్షలు తన సొంత నిధులు ఖర్చు చేస్తానన్నారు. విద్య, వైద్య, తాగునీరు, పారిశుద్ధ్యం మెరుగుకు నెలకు రూ.1.50 లక్షలు ఖర్చు చేస్తున్నానన్నారు. గ్రామంలో 1400 మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత చేపడుతున్నామన్నారు. అనంతరం ఆయన ప్రజాప్రతినిధులు, అధికారులను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాపల్లి భారతి, జెడ్పీటీసీ మోది రామాంజనేయులు, మాజీ సొసైటీ అధ్యక్షుడు వినయ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పాముల రమణయ్య, వైద్యులు శివకల్పన, వినీత, ఎంపీటీసీ జి.తిరుపతి, ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్, కార్యదర్శులు అమర్‌నాథ్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ఆరోగ్య సిబ్బంది స్థానికులు పాల్గొన్నారు.



వాస్తు హోమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు